
# పరువు తీసిన
# పిగ్ రూపాయి





**తుపాకుల తూటాలకు పంది, ఆవు కొవ్వులను పూతగా పూయడంతో సిపాయిలు తిరగబడ్డారు. అది క్రమంగా ప్రథమ స్వాతంత్ర్య సమరానికి దారితీసింది. దాంతో బ్రిటిష్ పాలకులు గడగడలాడారు. ఆ భయం ఇంకా వారి గుండెల్లో ఉండగానే అటువంటి సంఘటన 1911లో ఒకటి జరిగింది. అయితే ఈసారి వారు తప్పును వేగంగా దిద్దుకున్నారు. లేదంటే ప్రజల నుంచి మరో భారీ తిరుగుబాటును చవిచూడాల్సి వచ్చేది.**

కరెన్సీ అనేది ఒక దేశ విశ్వసనీయతకు, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. బ్రిటిష్ రాజ్ కాలంలో మన కరెన్సీ ప్రమాణాలు, నిల్వలు, నాణేల్లో ఏ లోహాలు ఎంత మేర వాడాలనేది వారే నిర్ణయించేవారు. 1910 మేలో బ్రిటన్ చక్రవర్తి కింగ్ ఎడ్వర్డ్-7 మరణించారు. ఆయన స్థానంలో కింగ్ జార్జ్-5 పీఠమెక్కారు. ప్రతీ పట్టాభిషేకానికి భారత్‌లో 'గ్రాండ్ దర్బార్'ను ఏర్పాటు చేయడం తెల్లవారికి అలవాటు. కొత్తరాజు ముఖంతో నూతన నాణేలను తయారు చేయడమూ రివాజే. ఇందుకోసం ప్రముఖ శిల్పి, నాణేల రూపకర్త సర్ బెర్‌ట్రాండ్‌ను నియమించారు. రాజు తలచుకుంటే నాణేలకు కొదవ ఏముంటుంది? వెంటనే 94 లక్షల వరకు రూపాయి, ఇతరత్రా వెండి నాణేలను సేకరించారు. వాటిని కరిగించి, కొత్త నాణేలను ముద్రించారు. రూ.1 విలువైన ఈ నాణేలన్నీ చలామణిలోకి వెళ్లాయి.

స్వాతంత్ర్య అమృత మహోత్సవం

### ఇక్కడే అసలు కథ మొదలైంది....

నాణేనికి ఒకవైపు కింగ్ జార్జ్-5 బొమ్మను ముద్రించారు. మరోవైపు పువ్వులు, తీగల డిజైన్‌తోపాటు ఒక రూపాయి, భారత్, 1911 అని ముద్రించారు. ఇంతవరకు బాగానే ఉంది. కింగ్ జార్జ్-5 కాలర్ చైన్‌ను బంగారు ఏనుగులు, రోజా పువ్వులు, నెమళ్లతో అలంకరించారు. ఏనుగు వద్దే సమస్య వచ్చింది. ఏనుగులా ఉండాల్సిన బొమ్మ కాస్తా దాని శరీరం, కాళ్లు, తోక, తొండం సరిగ్గా లేకపోవడంతో పందిలా కనిపించింది. దాంతో వాటిని 'పిగ్ రుపీస్'గా పిలవడం మొదలైంది. ఇదంతా ముస్లిం వర్గానికి అంతగా రుచించలేదు. రోజువారీ వినియోగించే ఈ నాణేన్ని చలామణిలోకి తేవడాన్ని తమను కించపరచడంగానే భావించారు. ఆందోళనలు చేపట్టారు. విషయం బ్రిటిష్ పాలకుల వరకు చేరింది. 1857 తిరుగుబాటు నాటి చేదు జ్ఞాపకాలు ఇంకా వారి మెదళ్ల నుంచి చెరిగిపోలేదు. ఇప్పుడూ అదేమాదిరిగా తిరుగుబాటు మొదలైతే? ఈ అనుమానం వచ్చిందే తడవుగా చలామణిలో ఉన్న ఆ నాణేలను ఉపసంహరించుకున్నారు. వినియోగంలో లేని నాణేలు కూడా భారీగానే చేరాయి. వీటన్నిటినీ కరిగించి... 1912లో ఏనుగు బొమ్మలో తొండం, దంతాలు, కాళ్లు సరైన నిష్పత్తిలో వచ్చేలా ముద్రించారు. వీటిని 'ఎలిఫెంట్ రుపీ'లుగా పిలిచేవారు. అలా ముద్రించిన 'పిగ్ రుపీలు' వారికి నిద్రలేకుండా చేశాయి. నాణేల సేకర్తల దగ్గర ఇప్పటికీ ఈ పిగ్ రుపీలు అక్కడక్కడా కనిపిస్తూ ఉంటాయి.

### కాగితం నోట్లు వచ్చాయిలా....

భారత్‌లో మొదటి నుంచీ వివిధ లోహాలతో చేసిన నాణేల వాడకమే అలవాటుగా ఉండేది. మనదేశాన్ని పాలించిన వివిధ రాజ్యాల రాజులంతా ఏకంగా 2,600 ఏళ్లపాటు నాణేలనే ముద్రించారు. తర్వాత ఈస్టిండియా కంపెనీ విస్తరణవాదం కారణంగా బంగారం, వెండి వంటి లోహాలకు కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో సంక్షోభం ఏర్పడుతుందని ముందుగానే గ్రహించిన బ్రిటిషర్లు కాగితం నోట్లను తీసుకొచ్చారు. యూరోపియన్ ట్రేడింగ్ కంపెనీలు కూడా 18వ శతాబ్దం సమయంలో కాగితం కరెన్సీని తెచ్చినా... వాటికి ప్రజల్లో అధికారిక వినియోగం ఉండేది కాదు. ఈ ఏజెన్సీ హౌజ్‌ల ఆధిపత్యానికి గండి కొట్టడంతోపాటు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి 1861లో 'పేపర్ కరెన్సీ యాక్ట్' ద్వారా బ్రిటన్ పార్లమెంటు ఈ నోట్లను తీసుకొచ్చింది. ఇవే మనదేశంలో తొట్టతొలిగా ముద్రించిన కాగితం నోట్లు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వీటిని ముద్రించేది. (కేవలం బ్రిటిష్ వారివే కాకుండా... 1890-1954 వరకు ఫ్రెంచి బ్యాంకు; 1863-1961 వరకు పోర్చుగీసు ప్రభుత్వం జారీ చేసిన నోట్లు కూడా భారత్‌లో చలామణి అయ్యేవి.) 1935లో ఏర్పాటైన రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత నగదు నిర్వహణ బాధ్యతను తీసుకుంది. నాటి నుంచి ఆర్‌బీఐ ముద్రించిన నోట్లే చలామణి అవుతున్నాయి.

# పంద్రాగస్టు ముహూర్తం వెనక..



**భారత స్వాతంత్ర్య ముహూర్తంగా 1947 ఆగస్టు 15నే ఎందుకు ఎంచుకున్నారు? ఎవరు, ఎలా నిర్ణయించారు? దానివెనక సాగిన కసరత్తు ఏంటని చూస్తే... నోటికొచ్చిన తేదీని అలవోకగా చెప్పేసి... దాన్నే ముహూర్తంగా నిర్ణయించి... రెండు నెలల్లో ఆంగ్లేయులు అధికారాన్ని బదిలీ చేసేశారని తెలిస్తే ఆశ్చర్యపోక తప్పదు!**

ఆరునూరైనా 1948 జూన్ 30లోపు భారత్‌లో వలస పాలనను ముగించి వెనక్కి వచ్చేయాలన్న ఏకైక లక్ష్యంతో మౌంట్‌బాటెన్‌ను వైస్రాయ్‌గా పంపించింది బ్రిటన్. దేశాన్ని విభజిస్తావో... ఐక్యంగా ఉంచుతావో ఏం చేస్తావో చేయమంటూ ఆయనకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. 1947 మార్చి చివర్లో దిల్లీలో అడుగు పెట్టిన మౌంట్‌బాటెన్ కాంగ్రెస్, ముస్లింలీగ్‌లను అధికార బదిలీకి అంగీకరింపజేశాడు. జూన్ 3న తన విభజన ప్రణాళిక ప్రకటించాడు.

స్వాతంత్ర్య అమృత మహోత్సవం

జూన్ 4న దిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించగా వివిధ దేశాల నుంచి 300 మంది విలేకరులు హాజరయ్యారు. సమావేశాన్ని ముగించి వెళ్లిపోయే ముందు... ఓ భారతీయ జర్నలిస్టు... 'అధికార బదిలీకి ఏదైనా తేదీ ఆలోచించారా?' అని ప్రశ్న సంధించాడు. కాసేపు ఆలోచించిన మౌంట్‌బాటెన్... 'అవును' అంటూ బదులిచ్చారు. ఏంటా తేదీ... అని అడిగాడా జర్నలిస్టు!

'అవును. తేదీని నిర్ణయించాను' అంటూనే అదేంటో చెప్పకుండా మౌంట్‌బాటెన్ ఒక్కొక్కరివైపూ తదేకంగా చూడసాగాడు. అప్పుడు హాల్లో గుండుసూది పడ్డా వినిపించేంత నిశబ్దం! దాన్ని ఛేదిస్తూ... 'భారత్ చేతికి అంతిమ అధికార బదిలీ 1947 ఆగస్టు 15న జరుగుతుంది' అని ప్రకటించాడు. ఒక్కసారిగా అందరికీ నమ్మశక్యంగాని పరిస్థితి. ఎందుకంటే ముహూర్తం బ్రిటన్ ప్రధాని అట్లీ చెప్పిన సమయం కంటే పది నెలల ముందుకు జరగటం... మరో రెండు నెలలు మాత్రమే మిగిలి ఉండటంతో బ్రిటన్ ప్రభుత్వమూ ఆశ్చర్యపడింది. రెండు నెలల్లోపు పార్లమెంటులో బిల్లు పాసవటం, రెండు దేశాల మధ్య సరిహద్దులు ఖరారు చేయటం, ఆస్తుల పంపకం... ఇవన్నీ జరిగేనా అని ఆందోళనకు గురైంది. కానీ మౌంట్‌బాటెన్ చెప్పినట్లుగా వ్యవహరించటం మినహా బ్రిటన్‌కు మరో మార్గం లేకపోయింది.

ఇంతకూ ఆగస్టు 15నే ఎందుకు ఎంచుకున్నాడనే ప్రశ్నకు కొంతకాలానికి ఆయనే సమాధానమిచ్చారు. 'త్వరగా అధికార బదిలీ చేయాలని అనుకున్నానే తప్ప 1947 ఆగస్టు 15 అని ముందే నిర్ణయించుకోలేదు. జర్నలిస్టు ప్రశ్న అడగ్గానే... తేదీని నిర్ణయించాల్సిన బాధ్యతా నాదే కదా అని అనిపించింది. అందుకే ఆ జర్నలిస్టు ఎప్పుడని అడగ్గానే కొద్ది క్షణాలు ఆలోచించా! వెంటనే ఆగస్టు 15 బుర్రలో వెలిగింది. ఎందుకంటే రెండో ప్రపంచ యుద్ధంలో అదే రోజు జపాన్ మా బ్రిటన్‌కు లొంగిపోయింది. నాకిష్టమైన ఆ రోజునే ప్రకటించేశా!" అని మౌంట్‌బాటెన్ వివరించారు. ఆ యుద్ధ సమయంలో ఆయనే ఆగ్నేయాసియాలో బ్రిటిష్ దళాల సుప్రీం కమాండర్. ఆ హోదాలో జపాన్ లొంగుబాటు ఒప్పందంపై సంతకం చేసిందీ ఆయనే! అందుకే ఆ రోజంటే మౌంట్‌బాటెన్‌కు అంత ఇష్టం.

## ముహూర్తం బాలేదు మార్చండి..

ఆగస్టు 15 ప్రకటన వెలువడగానే ఆ ముహూర్తం మార్చాలంటూ భారత నేతలపై ఒత్తిడి పెరిగింది. ఆ రోజు శుభప్రదంగా లేదని జ్యోతిష శాస్త్రవేత్తలు తేల్చారు. 14న బాగుంది... ఆ రోజుకు మార్చమన్నారు. చివరకు... 14 అర్ధరాత్రి రాజ్యాంగసభ సమావేశమై అధికారాన్ని చేపట్టాలని నిర్ణయించటంతో అంతా శాంతించారు. కొంతమంది... అర్ధరాత్రే కేబినెట్ ప్రమాణస్వీకారం చేయాలని సూచించారు. కానీ, సీనియర్ సభ్యులు చాలామందికి రాత్రి తొమ్మిదింటికే నిద్రపోయే అలవాటు ఉండటంతో అది సాధ్యపడలేదు. 15న ఉదయం 8.30 గంటలకు 500 మంది సమక్షంలో నెహ్రూ కేబినెట్ ప్రమాణ స్వీకారం చేసింది.

## పాక్‌కు ఆగస్టు 14 ఎలా?

మౌంట్‌బాటెన్ నోట్లోంచి ఆగస్టు 15 వచ్చాక... పాకిస్థాన్‌కు ఆగస్టు 14నే స్వాతంత్ర్యదినోత్సవం ఎలా వచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవటం సహజం. నిజానికి బ్రిటన్ పార్లమెంటు ఆమోదించిన బిల్లు ప్రకారం పంద్రాగస్టే రెండు దేశాలకూ స్వాతంత్ర్య దినోత్సవం. పాక్ విడుదల చేసిన తొలి స్టాంప్; జిన్నా తొలి ప్రసంగం ప్రకారం కూడా పంద్రాగస్టే! కానీ 1948 నుంచి పాకిస్థాన్ ఒకరోజు ముందే స్వాతంత్ర్య దినోత్సవం జరపటం మొదలెట్టింది. ఎందుకంటే... 1947 ఆగస్టు 14నే మౌంట్‌బాటెన్ కరాచీకి వెళ్లి అధికార బదిలీ కార్యక్రమంలో పాల్గొన్నాడు. అందుకే అప్పటి నుంచి ఆగస్టు 14ను పాక్ ఖాయం చేసుకుంది.

వీరులను విడిపించేందుకు...

# వివాహ నగల విరాళం



**భగత్‌సింగ్, రాజ్‌గురులాంటి నాటి విప్లవ వీరులు స్వాతంత్ర్య సాధనే ఊపిరిగా బతికారు. వేషాలు మార్చారు. జైళ్లకూ వెళ్లారు. వారిని కాపాడేందుకు ఓ మహిళామణి కూడా అంతే వీరోచితంగా ప్రయత్నించారు. ఈక్రమంలో బ్రిటిషర్ల నుంచి తప్పించుకునేం దుకు పట్టణాలను, ఉద్యోగాలను, వేషాలను మార్చారు. జైలు గోడలను బద్దలుకొట్టడానికి సాహసించారు. ఉద్యమకారులను విడిపించేందుకే తన పెళ్లి కోసం దాచిన నగలనూ ఖర్చు చేశారు. ఎన్నో కష్టాలను ఓర్పుగా అనుభవించారు. ఆ యోధురాలే... సుశీలాదీదీ.**

పంజాబ్ రాష్ట్రం దాంటో చుహార్ (ప్రస్తుతం పాకిస్థాన్)లో సంప్రదాయ కుటుంబంలో 1905 మార్చి 5న సుశీలాదీదీ జన్మించారు. తండ్రి ఆర్మీ డాక్టర్. చిన్నతనంలోనే తల్లి దూరమైంది. పాఠశాల విద్య పూర్తవగానే 1921లో జలంధర్‌లోని ఆర్య మహిళా కళాశాలలో చేరారు సుశీలాదీదీ. అక్కడ నాయకుల ప్రసంగాలతో ఆమెలో జాతీయోద్యమ బీజాలు నాటుకున్నాయి. రామ్‌ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్‌సింగ్, రాజేంద్ర లాహిరిల ఉరితీతతో ఆమె తీవ్రంగా కలత చెందారు. పోరాటంలో యువత పాల్గొనాల్సిన ఆవశ్యకతపై స్వయంగా కవితలు, పాటలు రాశారు. ఉద్యమం వద్దని తండ్రి వారించగా ఆమె ఏకంగా ఇంటినే వదిలేశారు.

స్వాతంత్ర్య అమృత మహోత్సవం

## భగత్‌సింగ్ డిఫెన్స్ కమిటీ

సుశీల 1928లో కోల్‌కతా వెళ్లి, ట్యూటర్‌గా పనిచేశారు. లాహోర్‌లో బ్రిటిష్ పోలీసు అధికారి సాండర్స్‌ను హత్య చేశాక కోల్‌కతాకు చేరుకున్న భగత్‌సింగ్‌తోపాటు మరికొందరికి దీదీ తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించారు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్‌ఎస్‌ఆర్‌ఎ)లో చేరి ఉద్యమకారులకు సహాయపడ్డారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు మహిళలతో 'భగత్‌సింగ్ డిఫెన్స్ కమిటీ'ని ప్రారంభించారు. దిల్లీ అసెంబ్లీ బాంబు కేసు, కాకోరీ దోపిడీ ఘటనల్లో అరెస్టై జైలుశిక్ష అనుభవిస్తున్న ఉద్యమకారులను విడిపించేందుకు విరాళాలు సేకరించారు. ఈ క్రమంలో సుశీల తన పెళ్లి కోసం దాచి ఉంచిన... 10 తులాల బంగారాన్ని క్షణమైనా ఆలోచించకుండా విరాళంగా ఇచ్చేశారు.

## వైస్రాయ్ హత్యకు పథకం

దిల్లీ అసెంబ్లీ బాంబు కేసులో భగత్‌సింగ్‌తోపాటు మరికొందరు అరెస్టయ్యాక హెచ్‌ఎస్‌ఆర్‌ఎ ఉద్యమకారులంతా కలిసి వైస్రాయ్ ఇర్విన్‌ను హతమార్చాలని పథకం రచించారు. ఇందుకు రెక్కీ నిర్వహించేందుకు సుశీల ఆంగ్ల మహిళ అవతారమెత్తారు. యూరోపియన్ వేషధారణలో వివరాలనూ సేకరించారు. అయితే ఆ పథకం విఫలమైంది. అనంతరం జైలు గోడలు బద్దలుకొట్టి భగత్‌సింగ్‌తోపాటు ఇతర ఉద్యమకారులను బయటకు తీసుకురావాలని అనుకున్నారు. ఇందుకు ఆయుధాలు, సామగ్రి అవసరమేర్పడింది. ఈ ఆపరేషన్‌లోనూ సుశీలా దీదీదే కీలకపాత్ర. ఈ క్రమంలో కోల్‌కతాలో ఉద్యోగాన్ని విడిచిపెట్టి లాహోర్‌కు చేరుకున్నారు. ఆయుధాల సేకరణకు సిక్కు యువకుడి వేషధారణలోకి మారారు. జైలుపై వేయాల్సిన బాంబును పరీక్షిస్తూ హెచ్‌ఎస్‌ఆర్‌ఏకు వెన్నెముకగా ఉన్న భగవతీ చరణ్ వోహ్రా దురదృష్టవశాత్తు మృతి చెందారు. దీంతో ఆ ప్రణాళిక కూడా విఫలమైంది. తమపై తిరుగుబాటుకు ప్రయత్నిస్తున్న సుశీలాదీదీ అరెస్టుకు బ్రిటిష్ ప్రభుత్వం వారెంట్ జారీ చేయగా అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆ సమయంలో ఉద్యమ ఆవశ్యకతను వివరిస్తూ భగత్‌సింగ్‌కు ఆమె రాసిన ఓ లేఖ అప్పటి 'స్వతంత్ర భారత్' పత్రికలో ప్రచురితమైంది. ఆ లేఖను ప్రచురించినందుకు బ్రిటిష్ ప్రభుత్వం పత్రిక ఎడిటర్ భగవత్‌పై దేశద్రోహ నేరం మోపి జైలుశిక్ష విధించింది. చంద్రశేఖర్ ఆజాద్ మృతి, భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల ఉరితీత అనంతరం బలహీనపడిన హెచ్‌ఎస్‌ఆర్‌ఏను గాడిన పెట్టేందుకు దీదీ దిల్లీ, లాహోర్ శాఖల బాధ్యతలు చేపట్టారు. భగత్‌సింగ్ ఉరితీతకు అప్పటి పంజాబ్ ప్రభుత్వ సెక్రటరీ హెన్రీ కిర్క్ కారణమని భావించిన దీదీ... ఆయన్ని తుద ముట్టించేందుకు ధన్వంతరి, జగదీశ్‌తో కలిసి లాహోర్‌లో పథకం రూపొందించారు. అనూహ్యంగా పోలీసులు జగదీశ్‌ను కాల్చి చంపారు. కొన్ని రోజులకు సుశీలాదీదీని అరెస్టు చేశారు. ఆధారాలు దొరక్కపోవడంతో ఆమెపై కేసు నమోదు చేయలేక... దిల్లీ వదిలిపోవాలని ఆదేశించారు.

## కాంగ్రెస్‌లో చేరి.. ఇందుమతిగా మారి..

జైళ్ల నుంచి ఉద్యమకారులను విడుదల చేయాలంటూ 1932లో దిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీలో సుశీలాదీదీ... ఇందుమతిగా పేరు మార్చుకుని పాల్గొన్నారు. అప్పుడు అరెస్టై ఆరు నెలల జైలుశిక్ష అనుభవించారు. విడుదలయ్యాక 1933లో ఉద్యమకారుడు శ్యాంమోహన్‌ను పెళ్లి చేసుకున్నారు. తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. క్విట్ ఇండియా ఉద్యమంలో భార్యాభర్తలు చురుగ్గా పాల్గొని ఎన్నోసార్లు జైలుకు వెళ్లివచ్చారు. స్వాతంత్ర్యం సిద్ధించాక దిల్లీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగానూ, దిల్లీ పురపాలక సంఘం సభ్యురాలిగానూ పనిచేసిన సుశీలాదీదీ 1963 జనవరి 13న మరణించారు.

# నాస్తికతతో మొదలై..

# భారత ఆస్తికమై!



అనీబిసెంట్

**నాస్తికవాదాన్ని బలపరుస్తూ బలమైన బ్రిటిష్ చర్చిపై తిరుగుబాటు చేసింది. జనాభా నియంత్రణపై మాట్లాడి జైలుకెళ్లింది. భర్తకు, కన్నబిడ్డలకూ దూరమైంది. మార్క్సిజం, సోషలిజం, స్వేచ్ఛావాదం... ఇలా వివిధ దారుల్లో నడిచింది. చివరకు భారత్‌తో ఆధ్యాత్మిక అనుబంధం పెంచుకుంది. కష్టకాలంలో కాంగ్రెస్‌ను నడిపించి జాతీయోద్యమాన్ని మలుపుతిప్పింది. ఆంగ్లేయులపై బ్రిటన్‌తోపాటు భారత్‌లోనూ అలుపెరగని పోరాటం చేసిన ఆ అసమాన స్త్రీశక్తి అనీబిసెంట్.**

మహిళా సమానత్వం, స్వేచ్ఛల గురించి వందేళ్లకంటే ముందే నినదించిన అనీవుడ్స్ 1847 అక్టోబరు 1న లండన్‌లో ఐరిష్ కుటుంబంలో జన్మించారు. 1867లో క్రైస్తవ మతాచార్యుడు ఫ్రాంక్ బిసెంట్‌ను పెళ్లాడి, ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చారు. బ్రిటిష్ సమాజంపై నాటి చర్చి పెత్తనాన్ని ప్రశ్నించారు. జాతీయ లౌకికవాద సంఘంలో, ఫేబియన్ సోషలిస్టు సొసైటీలో చేరి ఉద్యమాలు చేశారు. ఈ ప్రస్థానంలో అనేక ఒడుదొడుకులు ఎదుర్కొని 1873లో భర్త నుంచి విడాకులు తీసుకున్నారు. తర్వాత లండన్‌లో నేషనల్ రిఫార్మర్ వారపత్రిక సహ సంపాదకురాలిగా జాతీయ విద్య, కార్మిక సంఘాలు, మహిళలకు ఓటు హక్కు, గర్భ నిరోధం తదితరాలపై ఎన్నో వ్యాసాలు రాశారు. ఆమెవి ఎంతో ఆధునికమైన భావాలు. జనాభా నియంత్రణలో భాగంగా గర్భనిరోధంపై అనీబిసెంట్ తన సహసంపాదకుడు చార్లెస్ బ్రాడ్‌లాతో కలిసి రాసిన గ్రంథాన్ని చర్చి అసభ్యమైందిగా పరిగణించింది. వారిని కోర్టుకు లాగింది. చివరకు చర్చి ఆరోపణ వీగిపోయింది. లండన్‌లోని ఒక అగ్గిపెట్టెల కర్మాగారంలో 1888లో మహిళా కార్మికులు మెరుగైన పని పరిస్థితుల కోసం సమ్మె నిర్వహించారు. అగ్గిపెట్టెల తయారీలో వాడే భాస్వరంతో తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయనీ, యాజమాన్యం ఇచ్చే అరకొర జీతాలు సరిపోవడం లేదనే వారి డిమాండ్లకు అనీబిసెంట్ మద్దతిచ్చి... కోర్టులో గెలిచారు. లండన్ రేవు కార్మికుల సమ్మెలోనూ విజయం సాధించారు. 1875లో అనీబిసెంట్‌కు థియోసాఫికల్(దివ్యజ్ఞాన) ఉద్యమంపై ఆసక్తి ఏర్పడింది. ప్రాచీన గ్రీకు, బౌద్ధ, హిందూ సంప్రదాయాలను ఇముడ్చుకున్న ఉద్యమమిది. ఇదే ఉద్యమం అనీబిసెంట్‌ను 1893లో భారత్‌కు తీసుకొచ్చి మనదేశ సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవనానికి కృషి చేసేలా చేసింది. భారత్‌లో ఆధునిక విద్యా వికాసానికి 1898లో వారణాసిలో మదన్‌మోహన్ మాలవీయతో కలిసి ఆమె ప్రారంభించిన సెంట్రల్ హిందూ స్కూల్ అండ్ కాలేజ్ కాలక్రమంలో సుప్రసిద్ధ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంగా ఎదిగింది. బాలికల కోసమూ సెంట్రల్ హిందూ స్కూల్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలోనూ కళాశాలను స్థాపించారు.

## రాజకీయ సమరం

భారత్ స్వతంత్ర దేశంగా మారితే, ఇక్కడి జ్ఞాన సంపద యావత్ ప్రపంచానికి మార్గదర్శకత్వం వహిస్తుందనే నమ్మకంతో అనీబిసెంట్ 1913 నుంచి భారత రాజకీయాల్లో పాల్గొనసాగారు. అతివాద, మితవాద శిబిరాలుగా విడిపోయిన కాంగ్రెస్‌ను మళ్లీ ఒకే వేదికపైకి తెచ్చిన ఘనత ఆమెదే. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు అందులో గెలవడానికి బ్రిటిష్ పాలకులు భారతీయుల మద్దతు కోరారు. భారతీయ సైనికులు యుద్ధంలోకి దూకి ప్రాణత్యాగం చేస్తున్నా, తెల్లదొరలు మాటమాత్రంగానైనా కృతజ్ఞత తెలపలేదు. దీన్నిచూసి మండిపడిన అనీబిసెంట్ 1916లో బాలగంగాధర్ తిలక్‌తో కలసి హోమ్ రూల్ ఉద్యమం ప్రారంభించారు. భారత్‌కు స్వరాజ్యం సిద్ధించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ ఉద్యమం దేశమంతటా విస్తరిస్తుండటంతో అనీబిసెంట్‌ను బ్రిటిష్ పాలకులు 1917లో అరెస్టు చేసి ఊటీలో నిర్బంధించారు. కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల ఆందోళనలతో 3నెలల తర్వాత విడుదల చేశారు. అదే ఏడాది డిసెంబరులో అనీబిసెంట్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. యుద్ధం ముగిశాక కాంగ్రెస్‌లో గాంధీజీ సారథ్యంలో కొత్త నాయకత్వం ఆవిర్భవించింది. సహాయ నిరాకరణోద్యమం చట్ట ధిక్కారాన్ని ప్రోత్సహిస్తుందనే భావనతో అనీబిసెంట్ దాన్ని వ్యతిరేకించారు. రాజకీయ సంస్కరణలను సాధించడానికి రాజ్యాంగ సమ్మత పద్ధతులను అనుసరించాలన్నది ఆమె అభిమతం. నాటి నుంచి కాంగ్రెస్‌కు దూరమైనా భారత స్వాతంత్ర్య ఆవశ్యకతపై దేశవిదేశాల్లో పర్యటిస్తూ ప్రసంగాలు చేశారు. తర్వాత ఆమె పూర్తిగా దివ్యజ్ఞాన సమాజంపై దృష్టి పెట్టారు. 1920ల్లో అనీబిసెంట్ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తిని వెంటబెట్టుకుని అమెరికా వెళ్లారు. ఆయన్ని అభినవ బుద్ధుడిగా ప్రకటించారు. దీన్ని 1929లో కృష్ణమూర్తి తిరస్కరించినా, ఇద్దరి మధ్య అనుబంధం చెదరలేదు. చివరకు ఆమె 1933లో చెన్నైలో కన్నుమూశారు.

# ఇదిగో.. ఎదుగుదామిలా...



**ఒకవైపు వ్యాపారంలో ఆంగ్లేయులతో పోటీ పడుతూ... మరోవైపు స్వాతంత్ర్యోద్యమానికి అండగా నిలిచిన భారత పారిశ్రామికవేత్తలు... మరో అడుగు కూడా ముందే వేశారు! అదే... స్వాతంత్ర్యానంతర భారతావనికి దార్శనికపత్రం రూపొందించటం. ఆంగ్లేయులు పంద్రాగస్టు అనే తేదీని ప్రకటించకముందే... రెండో ప్రపంచ యుద్ధం ఇంకా ముగియకముందే... టాటా, బిర్లా తదితర పారిశ్రామికవేత్తలంతా కలసి ముందుచూపుతో 1944లోనే స్వతంత్ర భారత పారిశ్రామిక ప్రణాళికను రచించారు. అదే బొంబాయి ప్లాన్ 1944!**

రెండో ప్రపంచయుద్ధం ముగిసే సమయానికి ఒకవైపు బెంగాల్ క్షామం, మరోవైపు క్విట్ఇండియా ఉద్యమం రెండూ ఉద్ధృతంగా ఉన్నాయి. దాంతో ఇక స్వాతంత్ర్యం ప్రకటించక తప్పని పరిస్థితి ఏర్పడింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేస్తుందనే అంతా భావించారు. ఆ ఉత్సాహంతోనే కొత్తగా ఏర్పడే ప్రభుత్వానికి ఏకంగా పదిహేనేళ్ల వరకు మార్గసూచిగా నిలిచేలా కొందరు పారిశ్రామికవేత్తలు, నిపుణులు కలిసి సమగ్ర ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేశారు. ఆ మహామహుల్లో జేఆర్డీ టాటా, జీడీ బిర్లా, పురుషోత్తమ్దాస్ ఠాకుర్దాస్, అర్దేశిర్ ష్రాఫ్, కస్తూర్భాయ్ లాల్భాయ్, అర్దేశిర్ దలాల్, జాన్ మతాయ్, లాలా శ్రీరామ్ ఉన్నారు. ప్రభుత్వ జోక్యం, నియంత్రణ ఏవీ అవసరం లేకుండానే దేశంలో ఆర్థికవృద్ధి సాధ్యమేనని ఈ ప్రణాళిక తేల్చిచెప్పింది. విదేశీ కంపెనీల పోటీ నుంచి స్థానిక పరిశ్రమలకు రక్షణ కల్పించాలని సూచించింది. వ్యవసాయాధారిత దేశంలో క్రమంగా పారిశ్రామికీకరణ దిశగా మార్పు రావాలంది. జాతీయ ప్రణాళిక ద్వారా వనరులను కేటాయించాలని, ప్రాథమిక పరిశ్రమలు ప్రభుత్వ రంగంలో ఉండాలని, వినియోగదారులకు అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలను ప్రైవేటు రంగానికి విడిచిపెట్టాలని చెప్పింది. ప్రాథమిక పరిశ్రమల్లో రవాణా, రసాయనాలు, విద్యుదుత్పత్తి, ఉక్కు ఉత్పత్తి లాంటివాటిని ప్రస్తావించింది. ప్రాథమిక పరిశ్రమలను జాతీయీకరిస్తే ఆర్థిక అసమానతలు తగ్గుతాయని, తద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపింది. పౌరులకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలను మాత్రం ప్రభుత్వమే కల్పించాలని తేల్చిచెప్పింది.

## మూడు పంచవర్ష ప్రణాళికలుగా...

దేశానికి కావల్సిన వనరులను ఏయే రంగాలకు ఎంతెంత కేటాయించాలి, ఎంత మొత్తంతో ప్రణాళికలు రచించాలి, ఆ మొత్తాలను కాలక్రమంలో ఎలా పెంచుకుంటూ వెళ్లాలన్న విషయంలో నాటి ఆర్థిక నిపుణులకు పూర్తి స్పష్టత ఉంది. మొదటి పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి రూ.790 కోట్లు, రెండో ప్రణాళికలో రూ.1,530 కోట్లు, మూడో ప్రణాళికలో రూ.2,160 కోట్లు కేటాయించాలన్నారు. అలాగే వ్యవసాయం, రవాణారంగం, విద్య, ఆరోగ్యం, గృహనిర్మాణం.. ఇలా అన్ని రంగాలకూ కేటాయింపులు పెంచుతూ వెళ్లారు. తొలి ప్రణాళికను రూ.1,400 కోట్లతో రూపొందిస్తే, తర్వాతి రెండింటినీ వరుసగా రూ.2,900 కోట్లు, రూ.5,700 కోట్లకు పెంచడం వారి దార్శనికతకు నిదర్శనం.

మొదట్లో దీన్ని అంతర్గతంగానే పంచుకోవాలనుకున్నారు. కానీ ప్రణాళిక కలగజేసిన ఆసక్తి మామూలుగా లేకపోవడంతో కరపత్రం రూపంలో ప్రచురించారు. కొద్ది నెలల్లోనే దేశవ్యాప్తంగా పలు ప్రాంతీయ భాషల్లోకి అనువదించాల్సి వచ్చింది. ప్రణాళికాబద్ధమైన ఆర్థికవ్యవస్థలో ప్రైవేటు రంగానికి చోటు కల్పించేలా ఉన్న దార్శనిక పత్రం విప్లవాత్మక ఆలోచనగా మెప్పు పొందింది. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఇది చాలా ఉపయుక్తంగా ఉంటుందని నాటి వైస్రాయ్ లార్డ్ వేవెల్ అభివర్ణించగా, ఆర్థిక సభ్యుడు జెరెమీ రైస్మన్ సైతం స్వాగతించారు. 1944 మార్చి నాటికి ఫిక్కీ (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) తన వార్షిక ప్రణాళికలో దీన్ని ఆమోదించింది. రిజర్వుబ్యాంకు అప్పటి గవర్నర్ సి.డి. దేశ్ముఖ్ దీన్ని చూసే ప్రణాళిక, అభివృద్ధి శాఖను ఏర్పాటు చేయించారు. ఈ ప్రణాళికను ద గ్లాస్గో హెరాల్డ్, ద న్యూయార్క్ టైమ్స్ లాంటి పత్రికలన్నీ తమ పతాక కథనాల్లో ప్రస్తావించాయి.

## భావి ప్రణాళికలపై ప్రభావం

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలన్న బొంబాయి ప్లాన్ దార్శనికత స్వతంత్ర భారత దేశంలో మొదటి, రెండో పంచవర్ష ప్రణాళికలపై ప్రభావం చూపింది. పాశ్చాత్యదేశాల పెట్టుబడిదారీ విధానం, సోవియట్ రష్యాకు చెందిన సోషలిజం లాంటి అంశాలన్నింటినీ మిళితం చేస్తూ.. తన స్వతంత్ర మార్గాన్ని రూపొందించుకుని భారతదేశం ఒక రాజకీయ అర్థశాస్త్రాన్ని రూపొందించుకోడానికి మూలకారణం బొంబాయి ప్లాన్. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలను సమతుల్యం చేసుకునేలా భావి ప్రభుత్వాలకు మార్గదర్శనం చేసింది ఈ ప్రణాళికే!

# దేవుణ్నీ నిలువుదోపిడీ చేశారు!



ఆంగ్లేయులకు సంస్థానమైనా.... దేవస్థానమైనా ఒక్కటే. తమ ఖజానాను నింపే కాసుల గంపలే. సంస్థానాలను కైవసం చేసుకునేందుకు తలలు గిరాటేశారు. దేవస్థానాలపై పట్టుసాధించేందుకు తలలు వంచారు. ఒకచోట భయపెట్టి చరాస్తులను సంపాదించారు. మరోచోట భయపడినట్లు నటించి అపార ధనలాభాన్ని పొందారు.

ఈస్టిండియా కంపెనీ వారు మన దేవాలయాలను సైతం ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. కపట నాటకంతో భక్తుల కానుకలను కాజేశారు. తిరుపతి, కంచి, శ్రీరంగం, తిరువనంతపురం, పూరీ తదితర పట్టణాల్లోని ప్రసిద్ధ ఆలయాలకు భక్తులు వేలల్లో వెళుతుండటాన్ని గమనించారు. ఆయాచోట్ల మొక్కుల చెల్లింపులతో నిత్యం పోగుబడుతున్న బంగారం, వెండి, నగదును కొట్టేసేందుకు కొత్త అవతారమెత్తారు. దేవాలయాలకు చెందిన వేల ఎకరాల భూములను రైతులకు ఏటా రెవెన్యూ ఉద్యోగులే కౌలుకు ఇచ్చేవారు. శిస్తులను పకడ్బందీగా వసూలు చేసేవారు. అదేసమయంలో ఆలయాల్లో దేవుళ్ల పెళ్లిళ్ల నుంచి ఊరేగింపుల వరకు అన్నింటినీ దగ్గరుండి శాస్త్రప్రకారం చేయించేవారు. తమ ముందుకు వచ్చే సంస్థానాల రాజులు కిరీటాలను, సామాన్యులు తలపాగాలను తీసేయాలని ఆదేశించే కలెక్టర్లు, ఇతర ఉన్నతోద్యోగుల వైఖరి ఆలయాల ఉత్సవాల సమయంలో పూర్తిగా మారిపోయేది. వారు తమ బూట్లను విప్పి, టోపీలను సైతం తీసేసి విగ్రహాలకు నమస్కరించేవారు. ఉత్సవ మూర్తులకు కంపెనీ ప్రభుత్వం తరఫున ఏకంగా పట్టు వస్త్రాలను సమర్పించేవారు. ఉత్సవాలన్నీ అట్టహాసంగా నిర్వహించేవారు. రథాల ముందు కలెక్టర్ల ఆధ్వర్యంలో పోలీసులు, సైనికులు కవాతు చేసేవారు. అప్పట్లోనూ ఆయా ఆలయాల ఆదాయం భారీగానే ఉండేది. అక్కడ ఖర్చులుపోను మిగిలినదంతా లాభాలకింద పద్దు రాసుకుని, ఈస్టిండియా కంపెనీ ఖజానాకు తరలించేవారు. మొదట ఆంగ్లేయులు మద్రాసు ప్రెసిడెన్సీని ఫ్రెంచి వారి నుంచి 1759 ఫిబ్రవరిలో హస్తగతం చేసుకున్నారు. దక్షిణాదిన తమ అధికారం కుదురుకున్నాక ఆర్కాటు నవాబుల నుంచి 1801లో తిరుమల తిరుపతిని తమ హస్తగతం చేసుకున్నారు. అప్పటి నుంచి 42 సంవత్సరాల పాటు ఏడాదికి దాదాపు రూ. లక్ష వరకు తీసుకెళ్లారు.

## మిషనరీల అభ్యంతరం

భారత్‌లో మత ప్రచారానికి క్రైస్తవ మిషనరీలకు 1813లో బ్రిటిష్ పార్లమెంటు అనుమతి ఇచ్చింది. అదే అదనుగా మరుసటి ఏడాది నుంచే దేశంలోకి తండోపతండాలుగా మతబోధకులు అడుగుపెట్టారు. ఆలయాల విషయంలో ఈస్టిండియా కంపెనీ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆదాయం కోసం తమది కాని మతాన్ని ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఎట్టకేలకు 1843 నుంచి ఈస్టిండియా కంపెనీ... ఆలయాలపై తమ పెత్తనాన్ని వదులుకుంది. ఉత్సవాల నిర్వహణ బాధ్యతను స్థానిక అధికారులకు అప్పగించింది. అయితే ఏటా వచ్చే ఆదాయాన్ని మాత్రం తీసుకునేది. రాబడి తగ్గకుండా చూడాల్సిన బాధ్యతను రెవెన్యూ విభాగానికి అప్పగించి, మరీ పర్యవేక్షణ కొనసాగించింది.

# ఇలా బతికే కన్నా... చావే మిన్న!

**జాతీయోద్యమంలో మహాత్మాగాంధీ మాటంటే వేదవాక్కుగా సాగింది. సభలు, సమావేశాల్లో ఆయన మాట్లాడుతున్నారంటే అంతా ఆసక్తిగా వినేవారు. ప్రసంగాల్లో ఎక్కడా ఉద్రేకానికి గురిచేసే పదాలు ఉండేవి కావు. తాను చెప్పదలచుకున్న విషయాన్ని ప్రశాంత వదనంతో, నెమ్మదిగా, పూసగుచ్చినట్లు వివరించడం ఆయన నైజం. కానీ... మనదేశంలో తొలినాళ్లలో గాంధీజీ చేసిన ఓ ప్రసంగం సంచలనం సృష్టించింది. యువకులు కేరింతలు కొట్టగా... ప్రముఖులు ఖిన్నులై, వెళ్లిపోవడానికి సిద్ధమయ్యారు. గాభరా పడిన నిర్వాహకులు ఆయన ప్రసంగాన్ని మధ్యలోనే అడ్డుకోవాల్సి వచ్చింది.**




దక్షిణాఫ్రికా నుంచి 1915 జనవరి 9న భారత్ గడ్డపై అడుగు పెట్టిన గాంధీజీకి అనూహ్య స్వాగతం లభించింది. వెంటనే జాతీయోద్యమంలోకి దిగాలనే డిమాండూ బలంగా వినిపించింది. గాంధీజీ కూడా అందుకు సిద్ధమయ్యారు. ఆయన రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే మాత్రం తొందరపడవద్దని సూచించారు. 'మొదట దేశమంతా పర్యటించి పరిస్థితులను అవగాహన చేసుకో. ఈలోపు ఎక్కడా నోరు తెరవకుండా, ప్రసంగాలు చేయకుండా నిగ్రహించుకో' అంటూ హెచ్చరించారు. ఆయన ఆదేశంతో గాంధీజీ దేశ పర్యటన చేశారు. కానీ... కొన్ని సందర్భాల్లో ప్రసంగించాల్సి వచ్చింది. అందులో ప్రధానమైంది బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రారంభోత్సవ సభ ప్రసంగం. పండిత మదన్‌మోహన్ మాలవీయ చొరవతో ఈ విశ్వవిద్యాలయం నిర్మితమైంది. 1916 ఫిబ్రవరిలో మూడు రోజులపాటు సాగిన సంబరానికి బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ హార్డింగ్‌తోపాటు నిర్మాణానికి విరాళాలిచ్చిన అనేక మంది సంస్థానాధీశులు హాజరయ్యారు. గాంధీజీని కూడా ఆహ్వానించారు. వైస్రాయ్ రాక కారణంగా విశ్వవిద్యాలయంతోపాటు బెనారస్ అంతటా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. మూడోరోజు చివర్లో గాంధీజీని మాట్లాడమన్నారు.

## గాంధీ... ఇక చాల్లే.. కూర్చో!!

గుజరాతీ సంప్రదాయ ధోతీ, తలపాగా ధరించి వేదికపైకి వచ్చిన గాంధీజీ... వక్తల ప్రసంగాలు తనకేమాత్రం ఉత్సాహాన్నివ్వలేదంటూ నిర్మొహమాటంగా విమర్శలు కురిపించారు. దేశ భాషలను విస్మరించి ఆంగ్లంపై మోజు చూపడం మంచిదికాదని తేల్చి చెప్పారు. "మీ అందరి ముందూ మనదికాని మన భాషలో (ఆంగ్లంలో) మాట్లాడాల్సి వస్తున్నందుకు బాధగా, సిగ్గుగా ఉంది. రెండ్రోజులుగా సాగుతున్న ప్రసంగాల్లో ఏమాత్రం పసలేదు. వైస్రాయ్ వచ్చారని బెనారస్ అంతటినీ దిగ్బంధనం చేశారు. ఎక్కడ చూసినా గూఢచారులే. ఎందుకింత అపనమ్మకం? ఇలా భయంభయంగా జీవచ్ఛవంలా బతికే బదులు చావడం మేలు కదా! ఇక మహారాజులు, సంస్థానాధీశులు రెండ్రోజులుగా మనదేశ పేదరికం గురించి కన్నీరు కార్చారు. కానీ... వారు మాత్రం కాళ్ల నుంచి తలదాకా ఒంటినిండా వజ్రాలు, వైడూర్యాలు, బంగారు నగలను దిగేసుకొచ్చారు. ఆభరణాల ప్రదర్శనకు వచ్చినట్లు వచ్చారు. ఈ మహారాజులంతా తమ నగలన్నింటినీ మూటగట్టి దేశ ప్రజలకు ఉపయోగించేలా ఓ ట్రస్టు కింద ఉంచితే మేలు. ఇదంతా ఎవడబ్బ సొమ్ము. మన రైతుల కష్టఫలం. మన దేశానికి ముక్తి సామాన్య రైతుల నుంచే వస్తుంది. డాక్టర్లు, లాయర్లు, భూస్వాములు, మహారాజులతో కాదు. అందుకే... మనం మహారాజులకు, వైస్రాయ్‌లకు, కింగ్ జార్జ్‌కు కూడా భయపడాల్సిన అవసరం లేదు" అంటూ గాంధీజీ కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడసాగారు. సభ నిర్వాహకులు మాలవీయ, అనీబిసెంట్‌లు అయోమయంలో పడగా... సంస్థానాధీశులకు కోపం వచ్చేసింది. సభ మధ్యలోంచి విసవిసా వెళ్లిపోయారు. గాంధీ ప్రసంగాన్ని ఆపుతామంటూ మాలవీయ వారిని బతిమిలాడారు. అనిబీసెంట్ వెంటనే రంగంలోకి దిగి... గాంధీని ప్రసంగం ఆపేసి కూర్చోమన్నారు. యువకుల అరుపులు, కేకల కారణంగా... సభాధ్యక్షుడి అనుమతితో గాంధీజీ ప్రసంగం కొనసాగించారు. 'అపనమ్మకాలతో కాకుండా పరస్పర విశ్వాసపూరిత వాతావరణంలో పాలన కొనసాగాలి. ముఖస్తుతి చేయడం నా వల్ల కాదు. స్వయం పాలన అనేది ఒకరిచ్చేది కాదు. మనమే సాధించుకోవాలి. దీనికి ముందే మనం అన్ని విధాలుగా సిద్ధం కావాలి' అంటూ గాంధీజీ ప్రసంగిస్తుంటే మళ్లీ గొడవ మొదలై ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది

# చాయ్ కోసం.. ఉరితీశారు



**నమ్మే చాయ్ వ్యాపారం చూపించిన ఆయనే... నమ్మక ద్రోహం చూసి తిరుగుబాటు జెండా ఎత్తారు. భారతీయులను అణగదొక్కాలనుకున్న ఆంగ్లేయులను ఆర్థికంగా దెబ్బతీయాలనుకున్నారు. తొలి తేయాకు కంపెనీ పెట్టారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో భాగమయ్యారు. ఓర్వలేని బ్రిటిషర్లు ఏకంగా ఉరికంబమెక్కించారు... తెల్లవారి కుటిలనీతికి బలైన తొలితరం భారత మేధావి దీవాన్ మణిరామ్ దత్త బారువా!**


మణిరామ్ కుటుంబం అస్సాంలోని అహోం రాజాస్థానంలో కీలక పదవులు నిర్వహించేది. 1817 తర్వాత బర్మా దాడితో అహోం సామ్రాజ్యం కూలిపోయింది. తర్వాత బర్మా నుంచి ఆంగ్లేయులు వశం చేసుకున్నారు. ఆ సమయంలో మణిరామ్, ఆయన కుటుంబ సభ్యులు ఈస్టిండియా కంపెనీకి సహకరించారు. 1806లో జన్మించిన మణిరామ్‌ను అస్సాంలోని రంగపూర్ ప్రాంత తహసీల్దార్‌గా నియమించారు తెల్లవారు. అప్పటికి ఆయన వయసు 22 సంవత్సరాలే! తనకు అప్పగించిన ప్రాంతాలన్నింటినీ క్షేత్ర పరిశీలన చేస్తూ... ప్రజల బాగోగులు చూసేవారాయన. ఈ క్రమంలో... అస్సాం ఎగువ ప్రాంతంలోని సింగ్‌పో తెగవారు... తేయాకు పండిస్తూ... దాన్నుంచి ద్రావణం (టీ-చాయ్) తయారు చేసి తాగటం గమనించారు. ఆ సమయానికి... ఆంగ్లేయులు తేయాకు కోసం చైనాపై ఆధారపడేవారు. వారితో యుద్ధాలు కూడా చేశారు. తేయాకు ఉత్పత్తిలో చైనా ఏకఛత్రాధిపత్యం ఉండేది. ఈ నేపథ్యంలో... అస్సాంలో తేయాకు పంటకున్న అవకాశాల గురించి, స్థానిక ఆదివాసీ తెగల్లో అప్పటికే టీ తయారీ గురించి మణిరామ్ తనపై ఆంగ్లేయ అధికారికి వివరించారు. ఆశ్చర్యపోయిన ఆ అధికారి... స్వయంగా ఆదివాసీ గ్రామాన్ని సందర్శించాడు. అక్కడ వారు పండిస్తున్న తేయాకును, చాయ్ తయారీ పద్ధతిని తెలుసుకొని... వాటి నమూనాలను కలకత్తాకు పంపించారు. నాణ్యత అద్భుతం అని ఫలితం రావటంతో... ఆంగ్లేయులు ఎగిరి గంతేశారు. 1834లో అస్సాంలో తేయాకు వాణిజ్యానికి తెరదీశారు. కంపెనీలు, ఎస్టేట్‌లు ఆరంభించారు. ఈస్టిండియా కంపెనీ తేయాకు ఎస్టేట్‌కు మణిరామ్‌ను దీవాన్‌గా నియమించారు.

క్రమక్రమంగా ఆంగ్లేయుల వ్యాపార ఎత్తుగడలు, వ్యూహాలు మణిరామ్‌కు అర్థం కావటం మొదలయ్యాయి. స్థానికులను కాదని బయటి రాష్ట్రాల వారిని తీసుకొచ్చి తేయాకు తోటల్లో కొలువులివ్వటం; స్థానికుల స్థలాలు లాక్కొని వెళ్లగొట్టడం... పన్నులు భారీగా విధించటం... ఇవన్నీ మణిరామ్‌లో ఆగ్రహం కలిగించాయి. దీవాన్ పదవికి రాజీనామా చేసి సొంతంగా జోర్హాట్‌లో తేయాకు సాగు ఆరంభించారు. మరికొన్ని ప్రాంతాలకు విస్తరించటంతో పాటు అస్సాం వాసులనూ ప్రోత్సహించారు. క్రమశిక్షణతో వారు చేస్తున్న వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగింది. ఆంగ్లేయులతో పోటీగా... లండన్ ఎగ్జిబిషన్‌కు తమ ఉత్పత్తులనూ మణిరామ్ పంపించారు. ఆంగ్లేయులు పండించిన వాటిని కాదని... ఆయన తేయాకుకు స్వర్ణ పతకం లభించింది. ఇది తెల్లవారిలో అసూయ నింపింది. దీనికి తోడు... పడవల తయారీ, చేతి ఉత్పత్తులు తదితర మరికొన్ని వ్యాపారాల్లోకి మణిరామ్ దిగటంతో బ్రిటిషర్లు తట్టుకోలేకపోయారు. తమతో పోటీ పడుతున్న ఆయన్ను కట్టడి చేయటానికి నడుం బిగించారు. 1850కల్లా ఆంగ్లేయుల దాడి మొదలైంది. యూరోపియన్లకు పోటీ వస్తున్నాడంటూ... ఆయన తేయాకు తోటలపై ఆంక్షలు విధించారు. కుటుంబాన్ని ఆర్థికంగా వేధించటం మొదలెట్టారు. వీటిపై 1852లో ఆయన కలకత్తా కోర్టును ఆశ్రయించినా లాభం లేకపోయింది.

## ఆ తిరుగుబాటుతోపాటే..

ఆంగ్లేయుల స్థానంలో మళ్లీ అస్సాంలో అహోం పాలన పునరుద్ధరించాలని మణిరామ్ భావించారు. కలకత్తా చేరి పలువురు ప్రముఖులతో సంప్రదింపులు జరిపారు. అహోం రాజ వారసుడు కందర్పేశ్వర్ సింహాను కలిశారు. అదే సమయానికి... దేశంలో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం మొదలైంది. ఇదే అదనుగా... అస్సాంలోని డిబ్రూగఢ్, గోలాఘాట్ సిపాయిలతో కలిసి తిరుగుబాటుకు ప్రణాళిక రచించారు. 1857 ఆగస్టు 29న విప్లవకారులంతా నోగోరాలోని షేక్ భైకున్ ఇంట్లో సమావేశమై... దుర్గాపూజ రోజు శివసాగర్, డిబ్రూగఢ్‌లను స్వాధీనం చేసుకోవాలని అనుకున్నారు. ఓ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఇదంతా ఆంగ్లేయులకు తెలిసిపోయింది. వెంటనే... కందర్పేశ్వర్, మణిరామ్‌లతో పాటు ఇతర నాయకులనూ అరెస్టు చేశారు. విచారణలో దీనికంతటికీ మూలకారకుడు మణిరామ్‌గా తేల్చారు. 1858 ఫిబ్రవరి 26న జోర్హాట్‌లో ఆయనను బహిరంగంగా ఉరితీశారు. తద్వారా ప్రజల్లో భయాన్ని నింపాలని ఆంగ్లేయులు భావించారు. కానీ... అస్సాం ప్రజలు మణిరామ్ మరణాన్ని చూసి ఆగ్రహంతో ఊగిపోయారు. తేయాకు తోటలన్నింటినీ స్తంభింపజేశారు. నిరసనలు, బంద్‌లతో అస్సాం అట్టుడికింది. కానీ తెల్లవారు ఉక్కుపాదంతో ఈ తిరుగుబాటును అణచివేశారు. మణిరామ్ తేయాకు తోటలను వేలంలో ఆంగ్లేయులే స్వాధీనం చేసుకున్నారు.

# పిళ్లై... ఓడగొట్టాడు!



**స్వదేశీ ఉత్పత్తులంటే అగ్గిపెట్టెలు, సబ్బుల తయారీగా సాగుతున్న వేళ... ఏకంగా ఓ స్టీమ్ నావిగేషన్ కంపెనీని ఏర్పాటు చేయటం మాటలు కాదు. అదీ బ్రిటిష్ కంపెనీకి పోటీగా! ఆ సాహసమే చేసిచూపి అటు ఆంగ్లేయులను దెబ్బతీసి... ఇటు భారతీయుల్లో ఆత్మనిర్భరతను పెంచారు వి.ఓ.చిదంబరం పిళ్లై. ఈ క్రమంలో జైలుపాలై తన సర్వస్వాన్నీ కోల్పోయారు. భారత స్వాతంత్ర్యం కోసం నిబద్ధతతో పోరాడిన అరుదైన అమరుడు చిదంబరం పిళ్లై.**

బ్రిటిష్ స్టీమ్ నావిగేషన్ కంపెనీ (బీఎస్ఎన్‌సీ)... 1856లో ఆంగ్లేయులు ఏర్పాటు చేసిన ఓ ప్రైవేటు నౌకాయాన సంస్థ. తొలుత ఉత్తరాలు, పార్శిళ్లకు పరిమితమై తర్వాతి కాలంలో ప్రజా రవాణాతోపాటు చైనాతో తేయాకు, నల్లమందు వ్యాపారం కూడా మొదలెట్టారు. బ్రిటిష్ సర్కారుతో బంధం బాగా కుదిరింది. ఏకఛత్రాధిపత్యం చలాయిస్తున్న ఈ కంపెనీకి సముద్రజలాల్లో తిరుగులేకుండా పోయింది. భారతీయ ప్రయాణికులను, వ్యాపారులను వేధించి వివక్ష చూపేవారు. విచక్షణ రహితంగా ఓడల్లో ప్రయాణ ధరలను పెంచారు. భారతీయులు ఎక్కితే నీచంగా చూసేవారు. ఆంగ్లేయుల ఈ అరాచక సంస్కృతిపై తిరగబడాలని తమిళనాడు తూత్తుకుడి వ్యాపారులు నిర్ణయించుకున్నారు. వీరందరికీ నాయకత్వం వహించారు వీఓ చిదంబరం పిళ్లై.

తూత్తుకుడికి సమీప గ్రామంలో 1872లో ఓ సంపన్న కుటుంబంలో జన్మించిన వల్లినాయగన్ ఒలగనాథన్ చిదంబరం పిళ్లై లా చదివారు. 1905లో జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. 1907లో కాంగ్రెస్ పార్టీలో అతివాద-మితవాద చీలిక సంభవించింది. అతివాదులకు నాయకత్వం వహిస్తున్న బాలగంగాధర్ తిలక్ మద్రాసు రాష్ట్రంలో తన అనుయాయిగా చిదంబరం పిళ్లైని ఎంచుకున్నారు. అలాంటి పిళ్లై సారథ్యంలో స్వదేశీ ఉద్యమం ఊపందుకుంది. ఆ తరుణంలోనే బీఎస్ఎన్‌సీ వ్యవహారం తెరపైకి వచ్చింది. దీంతో భారతీయులకు స్వయంగా నౌకాయాన కంపెనీ పెట్టే సామర్థ్యం ఉందని నిరూపిస్తూ... 1906లో స్వదేశీ స్టీమ్ నావిగేషన్ కంపెనీ (ఎస్ఎస్ఎన్‌సీ)ని రిజిస్టర్ చేయించారు పిళ్లై. తూత్తుకుడి వ్యాపార వేత్తలు, పలువురు జమీందారుల నుంచి సేకరించిన రూ.10 లక్షల పెట్టుబడితో దీన్ని స్థాపించారు. మొదట్లో షాలైన్ స్టీమర్లను లీజుకు తీసుకొని నడిపించారు. షాలైన్‌పై బ్రిటిష్ కంపెనీ ఒత్తిడి తెచ్చి లీజ్‌ను రద్దు చేయించింది. దీంతో... సొంతగా ఓడలు కొనాలని నిర్ణయించుకున్నారు పిళ్లై. దేశవ్యాప్తంగా తిరిగి పెట్టుబడులు సమీకరించారు. ఫ్రాన్స్ నుంచి రెండు ఓడలు కొన్నారు. వీటిని తూత్తుకుడి కొలంబో మధ్య నడిపేవారు.

చిదంబరం దెబ్బకు.... బ్రిటిష్ కంపెనీ తక్షణమే తమ ఓడల్లో ప్రయాణ టికెట్ ధరలు తగ్గించింది. ప్రయాణికులు రాకపోవటంతో... చిదంబరం ఓడను ఎదుర్కోవటానికి బ్రిటిష్ కంపెనీ ఏకంగా... తమ ఓడలో ప్రయాణం చేసే వారికి ఉచితంగా గొడుగులిస్తామని ప్రకటించింది. అయినా బ్రిటిష్ ఓడకంటే... స్వదేశీ ఓడకే ప్రజలు ప్రాధాన్యం ఇచ్చేవారు. తమ వ్యాపారాన్ని దెబ్బతీస్తున్న చిదంబరం పిళ్లైని ఎలాగైనా కట్టడి చేయాలని ఆంగ్లేయులు నిర్ణయించుకున్నారు.

తూత్తుకుడి కోరల్ మిల్ కార్మికుల సమ్మె వారికి మంచి అవకాశంగా లభించింది. కార్మికుల వేతనాలు పెంచాలంటూ సమ్మె జరిగింది. వారి తరఫున పిళ్లై నిలబడ్డారు. యాజమాన్యం దిగివచ్చింది. ఈ స్ఫూర్తితో ఇతర యూరోపియన్ యాజమాన్య కంపెనీల్లోనూ సమ్మెలు మొదలయ్యాయి. అల్లర్లకు కారణమవుతున్నాడనే నెపంతో 1908లో ఓ రోజు చిదంబరాన్ని అరెస్టు చేశారు. ఈ విషయం తెలియగానే ప్రజలు తిరగబడ్డారు. పోలీసు కాల్పుల్లో నలుగురు చనిపోయారు. ప్రభుత్వం చిదంబరం పిళ్లైపై రాజద్రోహ నేరం మోపింది. విచారణానంతరం ఆయనకు 40 సంవత్సరాల యావజ్జీవ కారాగారశిక్ష విధించారు. హైకోర్టులో శిక్షను నాలుగేళ్లకు తగ్గించి, మరో ఆరేళ్లు తూత్తుకుడి బయట ఉండాలని ఉపశమనం కల్పించారు. జైల్లో ఆయనను గానుగకు పశువులా కట్టి పనిచేయించారు. 1912 డిసెంబరులో విడుదలయ్యే సమయానికి పిళ్లై ఆరోగ్యం దెబ్బతింది. అప్పటికే ఆయన స్థాపించిన స్టీమ్ నావిగేషన్ కంపెనీని దివాళా తీయించి... ఓడలను వేలం వేశారు. వాటిని పోటీ బ్రిటిష్ కంపెనీయే కొనేసింది.

బయటకు వచ్చాక తిలక్ శిష్యుడు అనే కారణంతో కాంగ్రెస్ పిళ్లైని అంతగా పట్టించుకోలేదు. చెన్నైలో కిరోసిన్ అమ్ముకుంటూ బతికారాయన. పేదరికంతో అల్లాడి చివరి రోజుల్లో మళ్లీ తూత్తుకుడి చేరుకున్నారు. 1936 నవంబరు 18న కాంగ్రెస్ కార్యాలయంలోనే తుది శ్వాస విడిచారు. అదే ఆయన చివరి కోరిక కూడా కావడం గమనార్హం.

# నరరూప చర్చిల్!



బెంగాల్ క్షామం: వీధుల్లో శవాలు.. గోడలపై రాబందులు

బెంగాల్‌లో క్షామం ఎంతగా విలయతాండవం చేసిందంటే... తల్లిదండ్రులు తిండి పెట్టలేని అశక్తులై తమ పిల్లల్ని చెరువులు, బావుల్లో విసిరేశారు. మరికొంతమంది పిల్లల్ని అమ్మేశారు. ఆకలికి తాళలేక అనేక మంది రైళ్లకింద పడి చనిపోయారు. చెట్ల ఆకులు, గడ్డి తిని బతికేందుకు ప్రయత్నించారు. ఇక కొంతమంది మహిళలు... తమ కుటుంబాలను పోషించుకోవటానికి కోల్‌కతాకు తరలి పడుపువృత్తిలోకి మారారు. చనిపోయిన తమవారికి అంత్య క్రియలు చేసే శక్తి కూడా ఒంట్లో లేక అలాగే విడిచిపెట్టేశారు. బెంగాల్ గ్రామాల్లో... గుట్టలు గుట్టలుగా పడ్డ శవాల కుప్పలపై రాబందులు... విందు చేసుకున్నాయి.



చర్చిల్

**ఆధునిక చరిత్రలో నరరూప రాక్షసత్వం అనగానే... గుర్తుకొచ్చే పేరు హిట్లర్. కానీ హిట్లర్‌కు ఏమాత్రం తీసిపోని... అమానవీయతకు నిలువెత్తు నిదర్శనంలాంటి మరో పేరు... విన్‌స్టన్ చర్చిల్! శ్వేతజాతి దురహంకారంతో భారత స్వాతంత్ర్యాన్ని తుదకంటా వ్యతిరేకించాడు. అన్నింటికి మించి... బెంగాల్ క్షామంలో తన పాశవిక నిర్ణయాలతో 30 లక్షల మంది భారతీయుల మరణానికి కారణమయ్యాడు.**

జర్మన్ నియంత హిట్లర్ జాత్యహంకారంతో యూదులను ఊచకోత కోస్తే... అదే జాత్యహంకారం, వివక్షలతో లక్షల మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయేలా చేశాడు చర్చిల్. బ్రిటన్ ప్రధానిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు.. హిట్లర్‌కు ఏమాత్రం తీసిపోనివే. 1943 బెంగాల్ క్షామంలో..., 30 లక్షల మంది పిట్టల్లా రాలిపోయారు. గుట్టలుగుట్టల్లా వీధుల్లో ప్రాణాలు విడిచారు.

బ్రిటిష్ హయాంలో మన దేశంలో అనేకసార్లు కరవు కాటకాలు సంభవించాయి. వాటిలో చాలామటుకు ప్రకృతి సంబంధమైనవైతే... 1943లో వచ్చిన బెంగాల్ క్షామం... చర్చిల్ నిర్ణయాలతో తలెత్తినదేనని ఆర్థికవేత్తలు తేల్చిచెప్పారు. రెండో ప్రపంచయుద్ధ నేపథ్యంలో ఐరోపా భవిష్యత్తును, వారి సైనికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని... భారతీయులకు తిండి దొరక్కుండా చేశాడు చర్చిల్. తన యుద్ధ కేబినెట్ భారత్‌లో క్షామం గురించి హెచ్చరించినా చర్చిల్ వినలేదు. ఒకవైపు ఇక్కడ తిండి గింజల కోసం ప్రజలు అలమటిస్తుంటే.. 1943 జనవరి నుంచి జులై మధ్య భారత్ నుంచి 70వేల టన్నుల బియ్యాన్ని లండన్‌లోని గోదాములకు తరలించారు. యుద్ధానంతరం పరిస్థితి ఎలా ఉంటుందోనని ముందస్తుగా గోదాముల్లో దాచి పెట్టారు. అదే మొత్తం భారత్‌లో అందుబాటులో ఉంటే 4లక్షల మందికి ఏడాదంతా సరిపోయేది. అంతేకాకుండా... జపాన్ దాడి చేస్తుందనే భయంతో బెంగాల్ తీరప్రాంతంలో ఆంక్షలు విధించాడు.

ఆ సమయంలో భారతీయుల దుస్థితిని చూసి బ్రిటిష్ వైస్రాయే కదిలిపోయారు. తక్షణమే ఆహార ధాన్యాలు కావాలంటూ స్వయంగా లండన్‌కు లేఖలు రాశారు. కానీ... చర్చిల్ ప్రభుత్వం వాటన్నింటినీ తిరస్కరించింది. భారత్‌కు ధాన్యం పంపిస్తే... భవిష్యత్ అవసరాల కోసం బ్రిటన్ గోదాముల్లో దాచిన నిల్వలు తగ్గిపోతాయని సాకు చెప్పింది. అంతేగాకుండా... "భారత్‌కు ఎంత ధాన్యం పంపినా సరిపోదు. ఎందుకంటే... భారతీయులు ఎలుకలు కన్నట్లు పిల్లల్ని కంటున్నారు. నిజంగా అంత సమస్యే ఉంటే గాంధీ ఇంకా ఎందుకు చావలేదు" అని చర్చిల్ వ్యాఖ్యానించాడు. ఈ విషయాన్ని అప్పటి బ్రిటన్‌లో భారత వ్యవహారాల మంత్రి లార్డ్ లియో ఆమ్రే స్వయంగా వెల్లడించారు. ఆ సమయంలో భారత్‌లో వైస్రాయ్‌గా ఉన్న లార్డ్ వేవెల్ సైతం... "బ్రిటిష్ హయాంలో చోటు చేసుకున్న అత్యంత దారుణమైన క్షామమిది. మా సామ్రాజ్య ప్రతిష్ఠకు ఇది మాయని మచ్చ" అని వాపోయాడు.

భారత స్వాతంత్ర్యాభిలాషను వ్యతిరేకించిన చర్చిల్ భారతీయులపై పదేపదే నోరుపారేసుకునేవాడు. "అటవిక దేశం... అటవిక మతం... అటవిక నాయకుడు" అని భారత్ గురించి చర్చిల్ దారుణంగా వ్యాఖ్యానించినట్లు లియో ఆమ్రే వెల్లడించారు. గాంధీని చర్చిల్ అర్ధనగ్న ఫకీర్ అని ఈసడించుకునేవాడు.

భారత స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించిన చర్చిల్ రహస్యంగా జిన్నాను రెచ్చగొట్టాడు. స్వాతంత్ర్యం అనివార్యమైనప్పుడు... పాకిస్థాన్‌తో పాటుగా తమ చెప్పుచేతుల్లో ఉండే సంస్థానాధీశులతో ప్రిన్సిస్థాన్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు కుట్రలు పన్నాడు.

# ఒకేరోజు 356 మంది ఊచకోత!

**తొంగి చూస్తే బ్రిటిష్ హయాంలో చరిత్రకెక్కని జలియన్‌వాలాబాగ్‌లెన్నో! మధ్యప్రదేశ్ సెహోర్ తిరుగుబాటు అలాంటిదే. స్థానిక రాణి బేగంపైనా, బ్రిటిష్ సర్కారుపైనా తిరుగుబాటు జెండా ఎగరేసి... ఐదునెలల పాటు హిందూ-ముస్లిం ఐక్య ప్రభుత్వాన్ని నడిపిన వారిని అత్యంత దారుణంగా అణచివేశారు. ఒకేరోజు 356 మందిని ఆంగ్లేయులు ఊచకోత కోశారు.**


భోపాల్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుందీ సెహోర్. ఆంగ్లేయుల కనుసన్నల్లో భోపాల్ సంస్థానం నవాబు సికిందర్ జహాన్ బేగం పాలనలో ఉండేది. నవాబు సైన్యంతో పాటు ఆంగ్లేయుల సైన్యం కూడా అక్కడే ఉండేది. రెండింటిలోనూ భారతీయులే సిపాయిలు. మేరఠ్, ఝాన్సీ తదితర ప్రాంతాల్లో మొదలైన 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ప్రభావం సెహోర్‌పై కాస్త ఆలస్యంగా పడింది. మేరఠ్, ఇండోర్‌ల నుంచి తిరుగుబాటు పోస్టర్లు సెహోర్ దళంలో కదలిక తెచ్చాయి. ఒకరిద్దరు నోరెత్తినా ఆంగ్లేయులు వారిని ఆదిలోనే అణచివేశారు. పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. 1857 జులైలో హోల్కర్ సంస్థాన సైన్యం... ఇండోర్‌లోని బ్రిటిష్ కంటోన్మెంట్‌పై దాడి చేసింది. ఆంగ్లేయుల రాజకీయ ప్రతినిధి హెన్రీ మరియన్ డ్యూరాండ్ పారిపోయి... సెహోర్ చేరుకున్నాడు. మిగిలిన చోట్ల ఆంగ్లేయులను తరుముతుంటే... తాము వారికి రక్షణగా నిలవటమేంటని సిపాయిల్లో ఆలోచన మొదలైంది. ఇండోర్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న 14 మంది భోపాల్ సిపాయిలు తిరుగుబాటు చేసి రావటంతో సెహోర్ సిపాయిల్లోనూ ధైర్యం వచ్చింది. దీంతో ఆంగ్లేయ అధికారులు అక్కడి నుంచీ పరారయ్యారు.

స్వాతంత్ర్య అమృత మహోత్సవం

ఆగ్రహించిన భోపాల్ బేగం... తిరుగుబాటుదారులను గుర్తించాల్సిందిగా తన అనుచరులను పంపించింది. ఈ చర్య సిపాయిలను మరింత రెచ్చగొట్టింది. ఇంతలో తిరుగుబాటును ప్రోత్సహిస్తున్నారంటూ హవల్దార్ మహవీర్, సుబేదార్ రామ్‌జులాల్, రిసాల్దార్ వలీషా, ఆరిఫ్‌లను సైన్యం నుంచి బహిష్కరించటమేగాకుండా అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇది అగ్నికి ఆజ్యం పోసింది. వలీషా, మహవీర్‌ల నాయకత్వంలో సెహోర్ దళం తిరుగుబాటు జెండా ఎగరేసింది. భోపాల్ బేగం ఆంగ్లేయులకు వత్తాసు పలుకుతుండటంతో వీరంతా అటు బేగంపైనా, ఇటు ఆంగ్లేయ సర్కారుపైనా తిరుగుబాటు చేసి 'సిపాయి బహదూర్ సర్కార్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అధికారిక కార్యాలయాల నుంచి బ్రిటిష్ జెండాను దించేశారు. హిందూ, ముస్లింల ఐక్య ప్రభుత్వానికి చిహ్నంగా మహవీర్ నిషాన్, నిషాన్-ఇ-మహమ్మది జెండాలు ఎగరేశారు. ఆగస్టుకల్లా మహవీర్, వలీ షాల సారథ్యంలో పరిపాలన మండలితో పాటు రెండు న్యాయస్థానాలు (క్రిమినల్, సివిల్) కూడా ఏర్పడ్డాయి. దాదాపు ఐదునెలల పాటు హిందు-ముస్లిం ఐక్య సర్కారు నిరాటంకంగా పాలన సాగించింది.

బయటి నుంచి ఝాన్సీలక్ష్మీబాయి ఇతర తిరుగుబాటు వీరులు కూడా వీరికి మద్దతు ప్రకటించారు. ఆంగ్లేయుల పక్షం వీడాల్సిందిగా భోపాల్ బేగంకు లక్ష్మీబాయి మూడుసార్లు లేఖలు రాశారు. కానీ బేగం తీరుమారలేదు. సిపాయి బహదూర్ సర్కార్‌ను మట్టుబెట్టడానికి అన్ని ప్రయత్నాలూ చేశారు. ఆంగ్లేయుల సాయం కోరుతూ వచ్చారు. 1858 జనవరిలో జనరల్ హ్యూ రోస్ సారథ్యంలో ఆంగ్లేయ సైన్యం భోపాల్ చేరుకుంది. తమ అధునాతన ఆయుధాలకు... బేగం అనుచరుల వంచన కూడా తోడవటంతో... 'సిపాయి బహదూర్ సర్కార్'ను అణచివేయటం ఆంగ్లేయులకు సులభమైంది. జనవరి 14న 356 మంది తిరుగుబాటు సిపాయిలను సెహోర్‌లో హ్యూ రోస్ సైన్యం అత్యంత అమానుషంగా విచారణ కూడా లేకుండా చంపేసింది. 149 మందినైతే వరుసగా నిలబెట్టి కాల్చేశారు. తిరుగుబాటు సర్కారు ఏర్పాటులో కీలకమైన మహవీర్‌ను కొద్దిరోజుల తర్వాత పట్టుకొని ఉరితీశారు. వలీ షా దొరకలేదు. మౌనంగా రోదించటం తప్ప సెహోర్ చేయగలిగిందేమీ లేకపోయింది. చివరకు చరిత్రలోనూ ఈ సంఘటన మరుగున పడిపోయింది.

# ఆంగ్లేయులకు శరత్ సశేష షాక్



దేవదాసు-పారు లాంటి పాత్రలతో బెంగాలోనే కాదు యావద్దేశాన్నీ ఓ ఊపు ఊపిన శరత్ చంద్ర ఛటర్జీ... బ్రిటిష్ సర్కారుకు ఓసారి అనూహ్య షాకిచ్చారు. ఆంగ్లేయులపై విప్లవ పోరాటాన్ని ప్రోత్సహించే నవల రాసి... వారిని తెలివిగా బోల్తా కొట్టించి ముద్రింపజేశారు. తెల్లబోయిన తెల్లవారు శరత్‌పై రాజద్రోహ నేరం మోపి... నవలను నిషేధించారు.

బెంగాలీ రచయితైనా ... తెలుగునాటే కాక యావద్దేశంలో మారుమోగిన పేరు శరత్! 1876లో జన్మించిన శరత్‌చంద్ర చటోపాధ్యాయ బాల్యం పేదరికంలో గడిచింది. చదువుల్లో చురుకైనా ఫీజులు కట్టే స్తోమత లేక ఉన్నత చదువులకు పోలేక... కుటుంబ పోషణార్థం రంగూన్‌లో ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. మొదట్లో మారుపేర్లతో ఆయన రాసిన కథలు చదివి బెంగాల్ అంతా ఆశ్చర్యపోయింది. బంకించంద్ర చటర్జీ తర్వాత ఇంత ప్రభావవంతంగా రాస్తున్నది... తప్పకుండా రవీంద్రనాథ్ ఠాగూరే అయ్యుంటారనుకుంది. ఠాగూర్ తాను కాదని చెప్పేశారు. అసలు రచయిత బయటపడగానే ... ఉన్నపళంగా బెంగాల్‌లో ప్రముఖుడయ్యారు శరత్! ముఖ్యంగా బెంగాలీ మధ్యతరగతికి హీరో అయ్యారు. బ్రిటిష్ సర్కారు దాష్టీకాలతో పాటు అప్పటి భారత సమాజంలోని అంటరానితనం, అసమానత, ఆధిపత్య ధోరణిలాంటి అనేక అవలక్షణాలనూ ఏమాత్రం ఉపేక్షించకుండా తన రచనల్లో ఎకిపారేసేవారాయన. ఇవన్నీ పాఠకులను ఉత్తేజపరిచేవి. ఎంతగా అంటే... స్వాతంత్ర్య సమరయోధుడు దేశబంధు చిత్తరంజన్‌దాస్ తన పత్రిక నారాయణ్ కోసం శరత్ రాసిన స్వామి అనే కథను చూసి పరవశులైపోయారు. దీనికి వెలకట్టే స్థాయి నాకు లేదంటూ... తన ఇష్టం వచ్చినంత సొమ్ము తీసుకోండని సంతకం పెట్టి శరత్‌కు ఖాళీ చెక్ ఇచ్చారు.

అరుదైన కథాశిల్పి శరత్ నుంచి వెలువడ్డ 'పథేర్ దబి' బెంగాలీ నవల సంచలనం రేకెత్తించటమేగాకుండా ఆయన్ను ఇబ్బందుల్లో పడేసింది. 1922 నుంచి 1926 దాకా బంగవాణి మాసపత్రికలో సీరియల్‌గా ఇది ప్రచురితమైంది. నవలలో పథేర్ దబి అనేది ఓ విప్లవవాద సంస్థ పేరు. ఆంగ్లేయుల బానిసత్వం నుంచి భారతావనిని విముక్తి చేయటం దీని లక్ష్యం. సంబంధాలంటే కేవలం కుటుంబ సంబంధాలే కాదని... భారత స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నవారంతా కూడా కుటుంబ సభ్యులే అన్నట్లుగా ప్రజలను చైతన్యం చేస్తుంది నవల. ఈ రచనలో ప్రభుత్వ వ్యతిరేకతను గుర్తించిన బ్రిటిష్ సర్కారు... మునుముందు పుస్తకంగా వేయకుండా నిషేధం విధించి, రచయిత, ముద్రణదారుపై కేసు పెడదామని నిర్ణయించుకుంది. మేగజీన్లో ఆఖరి అంకం కోసం వేచిచూడసాగింది. ఈ విషయం పత్రిక పబ్లిషర్ రామ్‌ప్రసాద్ ముఖర్జీకి తెలిసింది. అంతా కలిసి ఓ ఎత్తుగడ వేశారు. సీరియల్ పూర్తయినా కూడా 'సశేషం' అని ప్రచురించారు. అలా ఇంకా ఉందనే భ్రమలో ఆంగ్లేయ సర్కారును ఉంచి... మరోవైపు పుస్తకం రూపంలో ముద్రించటానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అంతకుముందే ఈ నవలను ముద్రించటానికి ముందుకు వచ్చి శరత్‌కు వెయ్యి రూపాయలు ముందస్తుగా ఇచ్చేసిన సంస్థ ప్రభుత్వానికి భయపడి వెనక్కి తగ్గింది. ఎవ్వరూ ముందుకు రాకపోవటంతో... మేగజీన్ పబ్లిషర్ రామ్‌ప్రసాద్ ముఖర్జీయే నడుం బిగించారు. కేసుల భారం, ఖర్చు తానే భరిస్తాననని రామ్ ప్రసాద్ హామీ ఇవ్వటంతో కాటన్ ప్రెస్ అంగీకరించింది. చకచకా నవలను 5వేల కాపీలు ముద్రించి మార్కెట్లోకి తీసుకొచ్చారు. వారం రోజుల్లో అన్నీ అమ్ముడైపోయాయి. ఆలస్యంగా విషయం తెలిసిన ఆంగ్లేయ పోలీసులు కాపీలను స్వాధీనం చేసుకోవటానికి బంగవాణి కార్యాలయానికి రాగా ఒక్కటంటే ఒక్కటీ లేదక్కడ. చివరకు రామ్ ప్రసాదే... తన సోదరి నుంచి పుస్తకాన్ని అరువుగా తీసుకొని పోలీసులకు ఒక కాపీ ఇవ్వాల్సి వచ్చింది. బ్రిటిష్ సర్కారు 1927 జనవరి 4న ఈ నవలను నిషేధించటమేగాకుండా రచయిత శరత్ చంద్ర, పబ్లిషర్, ముద్రణకారులపై రాజద్రోహ నేరం మోపింది.

ఆంగ్లేయ సర్కారు నవలను నిషేధించటంపై నిరసన తెలపాల్సిందిగా రవీంద్రనాథ్ ఠాగూర్‌ను శరత్ కోరారు. కానీ ఆయన నిషేధాన్ని సమర్థించారు. 'మీరు రాసిన నవల ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను పెంచుతోంది. హింసను ప్రేరేపిస్తోంది. ఎలాంటి హింసకైనా నేను వ్యతిరేకం. ఆంగ్లేయ ప్రభుత్వాన్ని విమర్శించవద్దని నేనను. కానీ విమర్శలు చేసినప్పుడు వాటి పర్యవసానాలను కూడా భరించటానికి సిద్ధంగా ఉండాలి' అంటూ ఠాగూర్ బదులిచ్చారు. దీనికి శరత్ కూడా అంతే ఘాటుగా స్పందించారు. 'పర్యవసానాలకు సిద్ధపడే రాశాను. కాకుంటే ఓ ప్రజాస్వామ్యవాదిగా సర్కారు నిరంకుశ ధోరణిని నిరసించటం హక్కుగా భావిస్తున్నాను. ఆ హక్కును మీరు కూడా వినియోగించాలన్నదే నా ఉద్దేశం. అంతేగానీ ప్రభుత్వం నుంచి ఉపశమనం ఆశించటం కాదు. మీరన్నట్లు ప్రజల్లో ఇది చైతన్యం తెస్తే నా లక్ష్యం నెరవేరినట్లే' అంటూ శరత్ తిప్పికొట్టారు. ప్రభుత్వానికి తలొగ్గటానికి మాత్రం ఆయన అంగీకరించలేదు. అటు బ్రిటిష్ సర్కారు అరాచకాలపై, ఇటు భారతీయ సమాజంలోని అవలక్షణాలపై తన కలంతో అలుపెరగకుండా పోరాడిన శరత్‌బాబు... 1938 జనవరి 16న కేన్సర్‌తో కన్నుమూశారు. రెండునెలల తర్వాత బెంగాల్ ప్రభుత్వం శరత్ నవలపై నిషేధం ఎత్తేసింది.

# 75 లక్షలకు కశ్మీర్‌ను అమ్మేశారు

**భారత ఉపఖండాన్ని నేటికీ వెంటాడుతున్న అనేక సమస్యలకు మూలాలు అంగ్లేయుల పాలనలో ఉన్నాయి. వాటిలో ఒకటి జమ్మూ కశ్మీర్! అంగ్లేయుల కనుసన్నల్లో జమ్మూ కశ్మీర్ స్వతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన తీరు ఆసక్తికరం. అధికార విస్తరణ, రాజకీయ ఎత్తుగడలు... డబ్బు యావతో జమ్మూకశ్మీర్‌ను రూ. 75 లక్షలకు అమ్మేసింది బ్రిటిష్ ప్రభుత్వం.**



గులాబ్‌సింగ్

భారత్‌లో ఈస్టిండియా కంపెనీ పాలన ప్రాబల్యం పెరిగేనాటికి జమ్మూ కశ్మీర్ సిక్కు సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. మహారాజా రంజిత్‌సింగ్ సారథ్యంలోని ఈ పంజాబ్ సామ్రాజ్యం అత్యంత పటిష్ఠమైంది. పశ్చిమాన అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లోని ఖైబర్ కనుమ నుంచి తూర్పున పశ్చిమ టిబెట్ దాకా; దక్షిణాన మిథాన్‌కోట్ (ప్రస్తుత పాకిస్థాన్‌లోనిది) ఉత్తరాన కశ్మీర్ దాకా విస్తరించి ఉండేది. లాహోర్ రాజధానిగా 1849 దాకా ఈ సామ్రాజ్యం కొనసాగింది. పాశ్చాత్యదేశాల తరహాలో బలమైన సైన్యాన్ని సమకూర్చుకున్నారు రంజిత్‌సింగ్. ఫ్రాన్స్, జర్మనీ, హాలండ్‌ల నుంచి యుద్ధనిపుణులను రప్పించి వారితో సైన్యానికి శిక్షణ ఇప్పించారు. బ్రిటిష్‌వారితోనూ సయోధ్య ఉండేది. వారికి పూర్తిగా లొంగిపోకుండా... అలాగని గొడవ పడకుండా సాగేది. ఈ క్రమంలో రంజిత్‌సింగ్ తిరుగులేని వీరుడిగా పాలన కొనసాగించారు. జమ్మూ డోగ్రా వంశానికి చెందిన గులాబ్‌సింగ్ 1810లో రంజిత్‌సింగ్ సైన్యంలో చేరాడు. తన బుద్ధి, భుజబలంతో రంజిత్‌సింగ్‌ను ఆకట్టుకున్నాడు. అంతేగాకుండా అఫ్గాన్ రాజుతో గొడవల్లో ఉన్న రంజిత్‌సింగ్‌కు అండగా నిలిచాడు. ప్రతిఫలంగా... జమ్మూ ప్రాంతరాజుగా 1822లో గులాబ్‌సింగ్‌కు స్వయంగా తిలకం దిద్దారు రంజిత్‌సింగ్. అలా సాగిన ఆ బంధం 1839లో రంజిత్‌సింగ్ మరణంతో మారిపోయింది.

రంజిత్‌సింగ్ మరణంతో సిక్కు సామ్రాజ్యంలో అంతర్గత విభేదాలు తలెత్తాయి. వారసుల్లో ఒకరినొకరు చంపుకొని అంతా అస్తవ్యస్తంగా మారింది. ఇదే సమయమని ఆంగ్లేయులు దీన్ని స్వాధీనం చేసుకునేందుకు రంగంలోకి దిగారు. భారత్‌లో చివరగా ఆంగ్లేయుల వశమైన ప్రాంతం ఇదే. జమ్మూ రాజు గులాబ్‌సింగ్ ఈ సమయంలో ఈస్టిండియా కంపెనీ వైపు మొగ్గు చూపాడు. 1845-46 మొదటి ఆంగ్లో-సిక్కు యుద్ధంలో గులాబ్‌సింగ్‌తో పాటు అనేక మంది సిక్కు రాజులు ఆంగ్లేయులకు సాయం చేశారు. దీంతో సిక్కు సామ్రాజ్యం పాక్షికంగా ఈస్టిండియా కంపెనీకి తలవంచింది. కోటిన్నర రూపాయలు జరిమానా చెల్లించాలంటూ ఆంగ్లేయులు పట్టుబట్టారు. అంత సొమ్ము ఆ సమయానికి సిక్కు సామ్రాజ్య ఖజానాలో లేదు. 50 వేలు మాత్రమే ఉంది. ఫలితంగా... సిక్కు సామ్రాజ్యంలోని అనేక ప్రాంతాలను ఈస్టిండియా కంపెనీ స్వాధీనం చేసుకుంది. వాటిలో ఒకటి కశ్మీర్! 1846 మార్చి 9న లాహోర్‌లో జరిగిన ఈ ఒప్పందంపై ఈస్టిండియా కంపెనీ తరఫున లార్డ్ హార్డింగ్, సిక్కు రాజ్యం తరఫున రంజిత్‌సింగ్ ఏడేళ్ల వారసుడు దులీప్‌సింగ్ సంతకాలు చేశారు.

ఆ తర్వాత వారం రోజులకే (మార్చి 16న) ఆంగ్లేయులు కశ్మీర్‌ను తమకు యుద్ధంలో సాయం చేసిన గులాబ్‌సింగ్‌కు రూ.75 లక్షలకు (సిక్కుసామ్రాజ్యంలో చలామణిలో ఉన్న నానక్‌షాహి రూపాయలు) అమ్మేశారు. అంతకుముందే గులాబ్ వద్ద ఉన్న జమ్మూతో కశ్మీర్‌ను కూడా కలిపి జమ్మూకశ్మీర్ రాజ్యాన్ని ఆంగ్లేయులు ఆవిష్కరించారు. ఈ మేరకు గులాబ్‌తో ఈస్టిండియా కంపెనీ చేసుకున్న ఒప్పందాన్ని అమృత్‌సర్ ఒప్పందంగా పిలుస్తారు. ఇందులో అనేక షరతులున్నాయి. రూ.75 లక్షలు ఇవ్వటంతోపాటు ఈస్టిండియా కంపెనీ అధికారానికి లోబడి ఉండాలి. అందుకు సూచికగా ఏటా గులాబ్‌సింగ్ సర్కారు ఆంగ్లేయులకు ఒక గుర్రాన్ని, 12 మేలుజాతి గొర్రెలను, మూడు కశ్మీరీ శాలువాలను ఇవ్వాలి. అవసరమైనప్పుడు ఆంగ్లేయులకు సైనిక సాయం అందించాలి. తన సరిహద్దులను రక్షించుకోవటంలో మహారాజా గులాబ్‌సింగ్‌కు కంపెనీ సహకరిస్తుంది. ఇలాంటి షరతులతో కొత్త జమ్మూకశ్మీర్‌ను ఆవిష్కరించిన ఆంగ్లేయులు 1848-49 రెండో ఆంగ్లో-సిక్కు యుద్ధం తర్వాత సిక్కు సామ్రాజ్యాన్ని పూర్తిగా తమ స్వాధీనంలోకి తెచ్చుకోవటం తదనంతర చరిత్ర!

# ముక్కుల ఆధారంగా
# ఆర్య-ద్రావిడ ముద్ర


రిస్లే

**1857 తర్వాత పాలన పగ్గాలు చేపట్టిన బ్రిటిష్ ప్రభుత్వం... భారత్‌ను ఆర్థికంగానే కాకుండా సామాజికంగా, రాజకీయంగానూ అల్లకల్లోలం చేసింది. విభజించు- పాలించు సూత్రాన్ని విస్తరించి... భారత సమాజంలో నేటికీ విప్పలేని చిక్కుముడులు వేసింది. సామాజిక శాస్త్రం పేరుతో ఆంగ్లేయులు తమ ప్రయోగాలకు భారత్‌ను వేదిక చేసుకున్నారు. తమకు అప్పటిదాకా తెలియని, అర్థంగాని, కొత్తదైన వర్ణ వ్యవస్థ, కులవ్యవస్థలపై సొంత సిద్ధాంతాలు రుద్దారు. అందులో ఒకటి ముక్కు కొలతల (నాసల్ ఇండెక్స్) ఆధారంగా భారతీయులను విభజించటం!**

ఈస్టిండియా కంపెనీ మాదిరిగా కేవలం ఆర్థిక దోపిడీకి మాత్రమే పరిమితం కాకుండా... భారత్ అనే బంగారు బాతును శాశ్వతంగా తన గుప్పిట్లో ఉంచుకోవాలనుకుంది ఆంగ్లేయ సర్కారు. ఇందుకోసం తమ వలస ప్రజల గురించి తెలుసుకోవటానికి ప్రయత్నించింది. అప్పటిదాకా జాతి మాత్రమే తెలిసిన ఆంగ్లేయులకు ఇక్కడి వర్ణ, కుల వ్యవస్థలు ఒకపట్టాన అర్థంకాలేదు. ఏకరూపతకు అలవాటు పడ్డ వారికి భారత్‌లోని సామాజిక భిన్నత్వం అనూహ్యంగా అనిపించింది. భిన్న మతాలు, కులాలు, భాషలు... వాటికి వృత్తులతో అనుబంధం తెల్లవారికి కొరకరాని కొయ్యలా తయారైంది.

ప్రతి దానికీ ఓ క్రమం... ఉండాలని భావించే ఆంగ్లేయులు... తమకు గందరగోళంగా ఉన్న భారతీయ సామాజిక వ్యవస్థనూ వర్గీకరించటానికి నడుంబిగించారు. అప్పటికే విభజించు పాలించు సిద్ధాంతాన్ని మతపరంగా హిందూ-ముస్లింల మధ్య చిచ్చుకు వాడుకున్న ఆంగ్లేయులు... భారతీయ సామాజిక వ్యవస్థలో కూడా ఈ విభజన బీజాలు నాటారు. సర్ హెర్బర్ట్ హోప్ రిస్లే... ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం దిగ్విజయంగా మొదలైంది. మొట్ట మొదటగా... భారతీయులను ముక్కు కొలతల ఆధారంగా ఆర్య, ద్రావిడులుగా విభజించాడు. జాతుల శాస్త్రం (రేస్ సైన్స్) పేరుతో శాస్త్రీయత ముసుగులో భారత్‌పై తన సిద్ధాంతాన్ని రుద్దాడు రిస్లే!

1873లో ఐసీఎస్ అధికారిగా భారత్‌కు వచ్చిన రిస్లే చాలాకాలం బెంగాల్ రాష్ట్రంలో పనిచేశాడు. తర్వాత భారత జనగణన కమిషనర్‌గా నియమితుడయ్యాడు. ఆంగ్లేయులది ఆధిపత్య జాతి అని నమ్మే కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన రిస్లే... బెంగాల్‌లోని వివిధ ఆదివాసీల సంప్రదాయాలు, అలవాట్లపై పరిశోధన చేశాడు. ఇదే సమయంలో... 19వ శతాబ్ది ఫ్రెంచ్ ఆంత్రోపాలజిస్టు పాల్‌టోపినార్డ్ ప్రతిపాదించిన ముక్కు కొలత సిద్ధాంతం ఆధారంగా రిస్లే భారతీయులపై తన భావనలను సంధించాడు. ముక్కుల వెడల్పు, ఎత్తులను సేకరించటానికి బ్రిటిష్ ప్రభుత్వం అనుమతి కూడా ఇచ్చింది. బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఆదివాసీ పురుషుల ముక్కులను కొలవటానికి ప్రయత్నించారు. చాలాచోట్ల ప్రతిఘటన ఎదురవటం; సర్వేకు వెళ్లినవారు సరైన సమాచారం ఇవ్వలేకపోవటంతో... చివరకు... జైళ్లలో మగ్గుతున్నవారి నుంచి కొలతలు సేకరించారు. ఆ వివరాలతో బెంగాల్ ఆదివాసీలు, కులాలు అంటూ 1891లో ఓ పుస్తకాన్ని ప్రచురించాడు రిస్లే! ఈ పుస్తకం వేసే సమయంలో ఇంగ్లాండ్ వెళ్లి అక్కడి, జర్మనీ సామాజిక శాస్త్రవేత్తలతో చర్చలు జరిపి వచ్చాడు. సామాజిక శాస్త్రవేత్తల పరిశోధనలకు భారత్ బంగారు గని అంటూ పరిస్థితిని వారికి వివరించాడు. భారత్‌లో ఆంత్రోపాలజీ పరిశోధన సంస్థను ప్రతిపాదించాడు. ఈ లాబీయింగ్‌తో భారత్‌లో అధికారిక ఆంత్రోపాలజిస్టు హోదా సంపాదించాడు. తద్వారా సామాజిక అంశాలపై రిస్లే మాట బ్రిటిష్ ప్రభుత్వానికి కీలకంగా మారింది.

## ముక్కు కొలత ఆధారంగా..

భారతీయులను రెండు జాతులుగా రిస్లే వర్గీకరించాడు. 1. నల్ల చర్మ ద్రావిడ జాతి 2. తెల్లగా ఉండే ఆర్యజాతి. వీరిలో... ద్రావిడులను ఆదివాసులుగా, నిమ్న జాతిగా... ఆర్యులను నాగరికులుగా, అగ్రజాతిగా రిస్లే ముద్రవేశాడు. కులాలే జాతులని, కులాల సామాజిక హోదా అనేది...వృత్తులపై కాకుండా... వారి ముక్కు కొలతకు విలోమానుపాతంలో ఉంటుందని రిస్లే వ్యాఖ్యానించాడు. అప్పటి నుంచి భారతీయులపైనా, కులాలపైనా యూరోపియన్ పరిశోధకులకు రిస్లే ప్రతిపాదనలే ఆధారమవుతూ వస్తున్నాయి. భారతీయ కులవ్యవస్థపై పరిశోధించి, విస్తారంగా రాసిన బాబా సాహెబ్ అంబేడ్కర్ లాంటివారు రిస్లే ముక్కు సిద్ధాంతాన్ని, దాని ఆధారంగా భారతీయుల వర్గీకరణను తోసిపుచ్చటం గమనార్హం. 'రిస్లే ముక్కు కొలతల ప్రకారం చూస్తే... బ్రాహ్మణులు, అంటరానివారు ఒకే జాతికి చెందినవారు. అంటే బ్రాహ్మణులు ఆర్యులైతే అంటరానికులాల వారూ ఆర్యులే. బ్రాహ్మణులు ద్రావిడులైతే అంటరానివారూ ద్రావిడులే. ఇది తప్పుడు భావనలపై చేసిన సిద్ధాంతం' అని అంబేడ్కర్ విమర్శించారు.